


రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి 2



బోధన్‌లో ఘరానా దోపిడీ.. 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## జిల్లా ప్రజలకు ప్రముఖుల రంజాన్ శుభాకాంక్షలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నియమనిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో కాలం వెళ్లదీయాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లింలు, రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.


20-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## గ్యాస్ కొరత.. కట్టెల పొయ్యిలే దిక్కు..

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ కొరత తీవ్రమైంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై ఆంక్షలు విధించింది. దీంతో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడి హోటళ్ల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నగరంలోని పలు హోటళ్లలో కట్టెల పొయ్యిలు దర్శనమిస్తున్నాయి. గ్యాస్ కొరతతో ఏం చేయలేక కట్టెల పొయ్యిలపై వంట చేస్తున్నామని హోటల్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.. నగరంలోని ఎల్లమ్మగుట్ట కమాన్ వద్ద, రైల్వేస్టేషన్ గీతాభవన్ వద్ద.. ఖలీల్ వాడిలోని ఇందూరు మెడికల్ చౌరస్తా వద్ద హోటళ్ల నిర్వాహకులు గ్యాస్ లేక కట్టెలపొయ్యిలపై వంట చేస్తున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## ప్రజా సంక్షేమ బడ్జెట్: డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర బడ్జెట్ ప్రజాసంక్షేమ బడ్జెట్ అని నిజామాబాద్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో పెద్దపీట వేశారన్నారు. ఈ ఏడాది రూ.26,674 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గతేడాది కంటే రూ.3,566 కోట్లు అదనంగా కేటాయించిందన్నారు. అంతేకాకుండా ఉద్యోగుల సంక్షేమం కోసం ఆరోగ్య పథకానికి రూ.1,056 కోట్లు, వ్యవసాయ అభివృద్ధి కోసం రూ.23,179 కోట్లు, రైతు భరోసా కోసం రూ.18,000 కోట్లు కేటాయించిదన్నారు. పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చే విధంగా గృహ నిర్మాణ శాఖకు రూ.7,430 కోట్లు కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తోందన్నారు. కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.998కోట్లు కేటాయించిందన్నారు.

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేస్తున్నారు. కామారెడ్డిలో శాశ్వత పనులను చేపట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తరచూ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు అందజేస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి



# ప్రయత్నాలు ఫలించేనా!

- కేంద్ర మంత్రులను కలుస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్
- కామారెడ్డి అభివృద్ధిపై వినతులు
- రూ.వేల కోట్ల ప్రతిపాదనలు ఇస్తున్న వైనం
- మంజూరైతే పట్టణ రూపురేఖలు మారే అవకాశం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు దాటిపోయింది. అయితే కామారెడ్డి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు తామే తెచ్చామని ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చెప్పుకుంటున్నారు. ఇద్దరు నాయకుల మధ్య ప్రొటోకాల్ వివాదం అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్న టాక్ వినిపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

### వరుస ఢిల్లీ పర్యటనలు

కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకట రమణారెడ్డి గెలుపొందిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవలేదన్న విమర్శలున్నాయి. తాజాగా మెడికల్ కళాశాలకు, డిగ్రీ కళాశాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సీఎంను కలిసి వినతిపత్రం అందజేయడంతో విమర్శలకు చెక్ పెట్టారు. నెలలో 10 రోజుల పాటు ఎమ్మెల్యే ఢిల్లీ పర్యటనలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. వరుసగా కేంద్ర మంత్రులను వివిధ పనుల మంజూరు నిమిత్తం కలుస్తున్నారు.

### కేంద్ర మంత్రులకు విన్నపాలు

అమృత్ 2.0 స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు రూ.39 కోట్లు కేటాయించింది. అయితే రైల్వే అభివృద్ధికి కావాల్సిన ఇతర అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారించారు. స్టేషన్‌కు ఆనుకుని ఉన్న మడిగెలు తొలగించి రైల్వే ముఖద్వారం ఏర్పాటుకు కేంద్ర మంత్రిని కలిసి విన్నవించారు. ఆర్వోబీల మంజూరుకు ప్రతిపాదించారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, విమానయాన శాఖ మంత్రి నిమ్మల రామ్మోహన్ నాయుడు, ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మలను కలిసి పలు పనుల ప్రతిపాదనలను అందజేశారు.

### రూపురేఖలు మారే అవకాశం

రాష్ట్రంలో బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే కామారెడ్డి నుంచి పోటీ చేసి ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించిన వ్యక్తిగా ఎమ్మెల్యే కేవీఆర్‌కు దేశవ్యాప్త గుర్తింపు లభించింది. ఈ గుర్తింపుతో ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదనలకు కేంద్రం నుంచి ఆమోదం లభించి పనులు ప్రారంభం అయితే ఎమ్మెల్యే పేరు కామారెడ్డి చరిత్రలో నిలిచిపోనుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలు ఏ మేరకు సఫలం అవుతాయో చూడాలి.

### ఎమ్మెల్యే ప్రతిపాదనలు ఇవే

కామారెడ్డి చుట్టూ 54 కిలోమీటర్ల మేర రూ.500 కోట్లతో రింగు రోడ్డు నిర్మాణం. లింగాపూర్ నుంచి మెడికల్ కళాశాల, మైనార్టీ ఉమెన్స్ కళాశాల మీదుగా జాతీయ రహదారి వరకు రూ.50 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు. భిక్కనూర్ నుంచి తిప్పాపూర్, తలమడ్ల మీదుగా రాజంపేట వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు. కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి హైవే వరకు రూ.24 కోట్లతో రోడ్డు విస్తరణ. మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం. కామారెడ్డి పట్టణంలో ఇండస్ట్రియల్ కారిడార్, కామారెడ్డిలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు.



## అన్నివర్గాలకు సంతృప్తిని ఇచ్చిన బడ్జెట్: షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజానుకూలంగా ఉందని.. మైనారిటీల సంక్షేమం, సామాజిక న్యాయానికి ఊతమిచ్చేలా ఉందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్ రైతులకు, ప్రజలకు అనుకూలంగా ఉండటంతో పాటు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించారు. ఇది వారి సమగ్ర అభివృద్ధి, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.178 కోట్ల పెరుగుదల ఉండడం, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తుందని తెలిపారు. మైనారిటీ మహిళలకు 10,000 కుట్టు మెషిన్ల పంపిణీ, 4,655 మంది మైనారిటీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలు ఆర్థిక స్వావలంబనను పెంపొందించడంలో సాయపడతాయని ప్రభుత్వ సలహాదారు అన్నారు. బడ్జెట్‌లో విద్యా, యువత ఉపాధికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు.



## ఎర్రజొన్న విత్తనాలు ఇచ్చిన వ్యాపారులే కొనుగోలు చేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎర్రజొన్న విత్తనాలు ఇచ్చిన వ్యాపారులే రూ.4వేలకు క్వింటాలు చొప్పున కొనుగోలు చేయాలని ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు ప్రభాకర్, మంథని గంగారాం, జక్కలింగారెడ్డి, దేవారాం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పసుపు ధరను కృత్రిమంగా తగ్గించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ అధికారుల నిర్లక్ష్యంపై చర్య తీసుకోవాలని.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. దీనికి అదనపు కలెక్టర్ స్పందిస్తూ.. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి త్వరలో కేంద్రాలు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోపాల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మోపాల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆయన స్టేషన్‌లో సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా ఉండాలని, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సిబ్బంది పనితీరు కనబర్చాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం, భద్రత చర్యలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన బొలెరో, పెట్రోల్ పెట్రోలింగ్ వాహనాల పనితీరును సీపీ ప్రత్యక్షంగా పరిశీలించారు. పెట్రోలింగ్ వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, ఇతర సామగ్రి ఉన్నాయా లేవా అని చూశారు. ఎల్లప్పుడూ వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా వాహనాలను సిద్ధం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఎస్సై సుశ్మిత, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం: నీలం చిన్నరాజులు



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలను ప్రజలకు ఇచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన అంశాలను అమలు చేయలేదన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికి ఇళ్లు ఇవ్వాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. 42శాతం ఇస్తామని చెప్పి 32శాతమే ఇచ్చి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడలు, ఇతర అంశాలపై చక్కగా దృష్టి సారించవచ్చని పేర్కొన్నారు. మాక్లూర్ మండలం దాస్ నగర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను రోజువారీగా తరలించేందుకు వీలుగా స్వచ్ఛ ఆటోను పాఠశాలకు పంపాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. గురుకులంలోని కిచెన్‌ను, విద్యార్థినుల కోసం వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. వివిధ విభాగాల వారీగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల గురించి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, చక్కటి ఆరోగ్యం కోసం ఆకుకూరలు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అశ్రద్ధ చేయకూడదని అన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు మార్గనిర్దేశం చేశారు. ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా, వార్షిక పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. బాలికల భద్రత, రక్షణ, ఆరోగ్యాల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని, బయటి వ్యక్తులు ఎవరూ పాఠశాల లోనికి రాకుండా గట్టి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్వేత, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వైద్యులు సందీప్, శశిధర్, అర్వింద్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ మండలంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జుక్కల్ మండలంలో ఇళ్ల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, పనుల వేగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిచేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆక్సిజన్ పార్క్ ను సందర్శించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కులో చెట్ల సంరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ముచ్చటిస్తూ వారి విద్య, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. తనిఖీల్లో పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, డీఈవో రాజు, డీపీవో మురళి, తహశీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పార్టీని బలోపేతం చేస్తాం..



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు పని చేస్తామని డీసీసీ కమిటీలో నియామకమైన నాయకులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో 84 మందితో డీసీసీ కమిటీ ప్రకటించిన విషయం తెలిసిందే. డీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, జూలూరి సుధాకర్, డీసీసీ ఉపాధ్యక్షులుగా పంపరి లక్ష్మణ్, సబ్బని హరికృష్ణ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తమపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మామిండ్ల అంజయ్య, పంపరి శ్రీనివాస్, తాటి ప్రసాద్, జమీల్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి: డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. నిజాంసాగర్, పిట్లం, జుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆస్పత్రి లో జరిగిన ఆరోగ్య పరీక్షలు ప్రసవాల గురించి స్థానిక వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్లు అందించాలని తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న పలువురికి ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ విజయ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభ, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని షబ్బీర్‌ను కోరిన ఆశావర్కర్లు



**అక్షరటుడే, కామారెడ్డి:** తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని ఆశావర్కర్లు కోరారు. ఆశావర్కర్లు ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టడానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కామారెడ్డిలోనే ఉన్నారని తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లారు. షబ్బీర్ అలీ ఆశావర్కర్లను తన కార్యాలయంలో కూర్చోబెట్టి వారి సమస్యలను విన్నారు. తమ వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సంబంధిత శాఖ మంత్రి, కమిషనర్ సమయం తీసుకుని తప్పకుండా ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను సమయం తీసుకున్న తర్వాత యూనియన్‌కు ముఖ్య నాయకులు హైదరాబాద్ రావాలని సూచించారు.



## రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

ఉమ్మడిజిల్లాలో రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఖిల్లా ఈద్గా వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో షామియానాలు, తాగునీటికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామారెడ్డి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఓల్డ్ ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. ఈద్గా వద్ద టెంట్లు, కుర్చీలు సమకూర్చారు. ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా ఓల్డ్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అందులో భాగంగా శనివారం నిర్వహించనున్న రంజాన్ వేడుకలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముస్లిం మత పెద్దలు హాజరు కానున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/కామారెడ్డి











## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మూలవిరాట్ ఊరేగింపు

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో శుక్రవారం ఉత్తర శబరిమల అయ్యప్ప ఆలయం మూలవిరాట్ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపకులు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1న ఉత్తర శబరిమల అయ్యప్ప ఆలయం ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా శుక్రవారం లింగంపేటలోని ప్రధాన వీధుల మీదుగా అయ్యప్ప మూలవిరాట్ విగ్రహాన్ని ఊరేగించామన్నారు. 200 మంది మహిళలు పాల్గొని సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈనెల 31న ఉత్తర శబరిమల అయ్యప్ప మూలవిరాట్ విగ్రహం స్పర్శ దర్శనం, ఏప్రిల్ 1న అయ్యప్ప ఆలయం ప్రాణ ప్రతిష్ఠకు శబరిమలై అయ్యప్ప స్వామి వంశస్థులు పాల్గొంటున్నట్లు ఆలయ ధర్మకర్త రవి గౌడ్ తెలిపారు. గ్రామంలోని మహిళలు మంగళహారతులు, కొబ్బరికాయలు అయ్యప్ప మూలవిరాట్‌కు సమర్పించారు. గురు స్వాములు చంద్రమౌళి, రాజు, ఉదయ్, పట్నం రమేష్, శ్రీకాంత్, అరుణ్, నాగరాజు, రాజిరెడ్డి, సతీష్, సిద్ధా గౌడ్ పాల్గొన్నారు.



## జిల్లా వైద్యాధికారికి సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లా వైద్యాధికారి రవీందర్ గౌడ్, డీసీహెచ్ఎస్ విజయ్ కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిరువురు జుక్కల్‌కు విచ్చేసిన సందర్భంగా జుక్కల్ జీపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆస్పత్రితో పాటు గ్రామపంచాయతీ పరిధిలో సైతం పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని వారు గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## జంగమయ్యపల్లిలో అలరించిన కుస్తీ పోటీలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని జంగమయ్యపల్లి గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు నిర్వహించిన పోటీలు అందరినీ అలరించాయి. కొబ్బరికాయ కుస్తీకి చిన్నారులు చేసిన పోటీ ఆకట్టుకుంది. ఈ కుస్తీపోటీలకు ఎల్లారెడ్డి మండలంతో పాటు పిట్లం, మద్నూర్, నారాయణఖేడ్, లింగంపేట, బిచ్కుంద, జుక్కల్ ప్రాంతాల నుండి మల్లయోధులు తరలివచ్చారు. పోటీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. గెలుపొందిన వీరులకు గ్రామ పెద్దలు నగదు బహుమతి అందజేశారు.



## కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మహమ్మద్ ఘాజి



**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా మహమ్మద్ ఘాజి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఘాజి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీకి నిబద్ధతతో సేవ చేస్తానని స్పష్టం చేశారు.

## పిచ్చుకల సంరక్షకుడికి సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకల సంరక్షణ కోసం కృషి చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ సిరిగాద ప్రసాద్‌ను హెల్త్ ఈజ్ వెల్త్ గ్రూప్ ఆధ్వర్యంలో సన్మానించారు. నగరంలోని కోటగల్లిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ పిచ్చుకలకు ఆహారం నీటి వసతి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందున ప్రసాద్‌ను సన్మానించామన్నారు. గ్రూప్ సభ్యులు శేఖర్, రాజేష్, గంగారెడ్డి, మధు, శ్రీనివాస్, గంగాదాస్, దేవారాం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలం కోడిచర్లలో ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మంజీర నుంచి శుక్రవారం ఇసుకను అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను కల్లూరులో అదుపులో తీసుకున్నామని ఎస్సై సునీల్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## సీఎం మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయి..

**అక్షరటుడే, బాన్సువాడ:** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాయిబాబా ఎర్రవట్టి అన్నారు. బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. సాయిబాబా మాట్లాడుతూ.. శాసనసభలో సీఎం ప్రవర్తన తెలంగాణ ప్రజలు అసహనం వ్యక్తం చేసే విధంగా ఉందని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పష్టత ఇవ్వకుండా సభను దారి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువస్తుంటే, ముఖ్యమంత్రి అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. నాచుపల్లి ఉప సర్పంచ్ శంకర్, నాగారం ఉప సర్పంచ్ సంజీవ్, ధోనకంటి ఆంజనేయులు, లక్ష్మణ్, అంజన్న, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## బోధన్‌లో ఘరానా దోపిడీ.. కారు అద్దాలు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లిన దొంగలు..



**అక్షరటుడే, బోధన్:** సినీఫక్కీలో కారులో ఉంచిన నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బోధన్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. బ్యాంకులు, ఇతర సంస్థల్లో నగదు తరలించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ దోపిడీలు జరుగుతూనే ఉన్నాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గోశాల రోడ్‌లోని యూనియన్ బ్యాంక్ లో హరిబాబు అనే వ్యక్తి రూ.3 లక్షలను డ్రా చేశాడు. అనంతరం నగదును కారులో ఉంచి పని నిమిత్తం మళ్లీ బ్యాంక్‌లోకి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలూర్‌లో దొంగల బీభత్సం.. పది తులాల బంగారం చోరీ..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి ఏకంగా పది తులాల వరకు బంగారం, నగదు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు, ఇంట్లోని బీరువాలను పగులగొట్టి 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన తలారి జమున ఈనెల 15న సాయంత్రం తన ఇంటికి తాళం వేసి జుక్కల్‌లో నివసిస్తున్న తన చిన్న కుమారుడి వద్దకు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన పొరుగువారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జమున కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకుని ఇంటిని పరిశీలించగా బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆర్మూర్ సీఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## 17వ హనుమాన్ దీక్ష స్వాముల మహా మండల పూజ



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయం ఆవరణలో శనివారం 17వ హనుమాన్ దీక్ష స్వాముల మహా మండల పూజ నిర్వహించనున్నట్లు అఖిల భారత హనుమాన్ దీక్ష సేవా సమితి గురు స్వాములు పేర్కొన్నారు. కార్యక్రమానికి పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ.. శనివారం విశ్వశాంతి కోసం అష్టోత్తర శత కుండాత్మక (108) సుందరకాండ పారాయణ సహిత 162వ హనుమాన్ మహా యజ్ఞం, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం, మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సుందరకాండ పారాయణంతో కూడిన మహా యజ్ఞం శనివారం ప్రారంభమై ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు నిర్విరామంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ స్వాములు అంబిలిపూర్ రాజు, పాలకుర్తి దత్తు, సాయ గౌడ్, గోకన్ శంకర్ గౌడ్, తేలి మహేష్ కుమార్, కల్లేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.